కొల్లేరు డ్రెయిన్ల ఆక్రమణపై కఠిన చర్యలు



లక్ష్మీపురం వద్ద బొబ్బిలిలంక డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న దృశ్యం



దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

భీమడోలు: కొల్లేరు డ్రెయిన్ల ఆక్రమణను సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్ అన్నారు. ఇటీవల భారీ వర్షాలకు గుండుగొలను రెవెన్యూ పరిధిలోని భోగాపురం, వడ్డిగూడెం గ్రామాలకు చెందిన 250 ఎకరాల్లో వరి నాట్లు పూర్తిగా మునిగాయి. మురుగునీరు వెళ్లే డ్రెయిన్లను ఆక్వా యాజమానులు ఆక్రమించుకోవడం వల్లే ఈ పరిస్థితికి కారణమని రైతులు వాపోతున్నారు. లక్ష్మీపురం వద్ద మురుగునీటిని బయటకు తీసుకుని వెళ్లే మేజర్ డ్రెయిన్ బొబ్బిలిలంకలో పొక్లెయినర్ల సాయంతో పూడిక తీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆ పనులను మండల డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, ఏవో ఎస్‌పీపీ ఉషారాణి సోమవారం పరిశీలించారు. ఆక్వా చెరువు గట్టు డ్రెయిన్‌కు అడ్డుగా ఉండడంతో ఆక్వా రైతు ఆ పనులను అడ్డుకునే ప్రయత్నం చేసారు. సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్, ఏవోలు ఘటన స్థలానికి వెళ్లి పనులను పరిశీలించారు. పనులను అడ్డుకుంటే సహించేది లేదని, సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని ఆక్వా రైతులను హెచ్చరించారు. మురుగునీరు దిగువకు ప్రవహించకుంటే ఎగువ ప్రాంతాల్లోని పంట చేలు ముంపు బారిన పడి రైతులు ఇబ్బందులు పడతారని ఆయన ఆక్వా రైతులకు తెలియజేసారు. దీనితో రైతులు, ఆక్వా రైతులు చర్చించుకుని ఓ అంగీకారానికి వచ్చారు. దీనితో పనులు యథావిధిగా కొనసాగాయి. మంగళవారం సాయంత్రానికి డ్రెయిన్ పూడిక తీత పనులు చేపడతామని, దీనితో ముంపు నీరంతా కొల్లేరులోకి చేరుతుందని పేర్కొన్నారు. ముంపు వల్ల 30 ఎకరాల్లో, ఎంఎం పురంలోని 15 ఎకరాల్లోని వరి నాట్లు పాడయ్యాయని ఏవో ఎస్‌పీపీ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్వో శేషు పాల్గొన్నారు.

కాలువను అభివృద్ధి చేయాలని వినతి



పెదపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందిస్తున్న రైతులు

పెదపాడు: భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురికాకుండా మురుగు దిగువకు వెళ్లేలా కొత్త ముప్పర్రు శివారు వీరభద్రపురం మొండివాగు కాలువను అభివృద్ధి చేయాలని కోరుతూ పెదపాడు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సోమవారం అందించారు. వరద కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వలంటీరు సేవల కారణంగా ఆర్థిక భరోసా

వలంటీర్లకు వందనం



సూరప్పగూడెంలో పథకానికి బయోమాట్రిక్ తీసుకున్న వలంటీర్ మానికిరెడ్డి సూర్యకుమారి

భీమడోలు: సూరప్పగూడెంకు చెందిన వలంటీర్ మానికిరెడ్డి సూర్యకుమారి కన్న బిడ్డ వలే నా అలనా పాలనా చూస్తోంది. నన్ను ఓ తల్లిగా చూస్తూ పథకాలన్నింటినీ గడప వద్దకే తీసుకువస్తోంది. ప్రస్తుతం జగనన్న తోడు, కాపు నేస్తం పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. ఈ పథకాలకు అర్హత కలిగిన నాకు నా ఇంటి వద్దకే వలంటీరు వచ్చి అవగాహన కల్పించి సంబంధిత పత్రాలను తీసుకుని వెళ్లి వాటిని మంజూరు చేయించింది. దీంతో అన్ని విధాలుగా ఆర్థిక భరోసా లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందరో అభాగ్యుల కోసం వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్నారు. ఆయన రుణం తీర్చుకోలేం. మా వలంటీర్ సూర్యకుమారి మా క్లస్టర్‌లో ప్రతి ఒక్కరికీ అర్హత ఆధారంగా పథకాలు అందేలా కృషి చేస్తోంది.

ఇంటి వద్దకే పింఛను

'నా పేరు గేలం దుర్గా(56). నా భర్త చనిపోయారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. దీనితో నేను ఒంటరిగా ఉంటూ ఇడ్లీలు వేసుకుని జీవనాన్ని సాగిస్తున్నాను. ఏటా జగనన్నతోడు రూ.10వేల ఆర్థిక సాయంతో ఇడ్లీ దుకాణాన్ని నడుపుకుంటున్నాను. కాపు నేస్తంలో రూ.15వేల ఆర్థిక సాయం అందుతోంది. మా మనవరాళ్లకు అమ్మ ఒడి పథకంలో రూ.13వేలను అందుతోంది. గత ప్రభుత్వంలో నాకు వితంతు పింఛను మంజూరయ్యింది. గతంలో ప్రతి నెల పనులు మానుకొని ఒకటో తేదీ నుంచి పంచాయతీకి వెళ్లి క్యూ కట్టి పింఛన్ తీసుకునే దాన్ని. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛను అందిస్తున్నారు.'

క్లుప్తంగా

నేడు నారాయణపురంలో 'గడపగడపకు'

ఉంగుటూరు: ఉంగుటూరు శివారు, కొత్త ఉంగుటూరు, నారాయణపురం వైఎస్సార్ కాలనీ ఏ,సీ బ్లాకుల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, అధికార్లు పాల్గొనాలని మంగరావు కోరారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్



పెదపాడు మండలంలోని రాజుపేట వద్ద సీజ్ చేసిన కోళ్ల వ్యర్థాల వాహనం

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని రాజు పేట వైపు నుంచి కడిమి కుంట గ్రామానికి కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్టు తెలిపారు. వాహనాన్ని అడ్డుకుని 3టన్నుల కోళ్ల వ్యర్థాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహన యజమాని, కోళ్ల వ్యర్థాల యజమాని, చేపల చెరువుల యజమాని మొత్తం ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం ఉంగుటూరులోని ఆర్‌నోవా పాలిమర్స్, ఆర్‌నోవా ఫిషరీష్ ఎక్స్‌పోర్టు పరిశ్రమను తిలకించారు. థర్మాకోల్ తయారీ విధానాన్ని అధ్యయనం చేశారు. ఉంగుటూరులో ఎర్రచందనం వృక్షాలను పరిశీలించారు. వెంకటేశ్వరరెడ్డి, ఆయేషా గైడుగా వ్యవహరించారు. బీఏ, బీకాం మొదటి సంవత్సరం విద్యార్థులు జీలకర్రగూడెం బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించారు. వీరికి అధ్యాపకులు ఉమాశంకర్, పి.భాస్కరావు, లావణ్య, పార్వతి, నిర్మలా జ్యోతి గైడులుగా వ్యవహరించారు.

ఓటు హక్కు విలువైనది



ఓటు నమోదుపై సిబ్బందితో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు టౌన్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి వ్యక్తికీ విలువైనదని ఏలూరు 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పర్యవేక్షణలో ఏలూరు నగరంలో ఓటరు వెరిఫికేషన్ చేపట్టారు. సచివాలయ, రెవెన్యూ శాఖ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు నమోదు, మార్పులు చేర్పులు, ఇతర వివరాలపై ఆరా తీస్తున్నారు. వన్‌టౌన్ 7వ డివిజన్ పరిధిలో ఓటరు వెరిఫికేషన్‌ను కార్పొరేటర్ శ్రీదేవి పరిశీలించారు. ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది పనిచేయాలని కోరారు. సచివాలయంలోనూ సిబ్బందితో ఓటరు వెరిఫికేషన్‌పై చర్చించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు టౌన్: తల్లి మందలించిందని తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన భలే కృష్ణంరాజు (27) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణంరాజు తల్లి కొంతకాలం క్రితం కువైట్ దేశం ఉపాధి కోసం వెళ్లింది. ఆమె డబ్బులు పంపుతూ ఉండగా కృష్ణంరాజు సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన తల్లి అతడ్ని మందలించింది. తీవ్ర మనస్థాపానికి గురైన కృష్ణంరాజు ఈనెల 26న విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఆర్డీఓ పెంచల కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. రాగిజావ తయారీకి గ్యాస్, వంట పాత్రలు సరఫరా చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడారు. వై.చంద్రకళ, కె.విజయలక్ష్మి, టి.స్వర్ణకుమారి, కె.విజయ, ఎం.నాగమణి పాల్గొన్నారు.

మణిపూర్ హింసను నిరసిస్తూ భారీ ర్యాలీ



తహసీల్దారు వెంకటరమణకు ఉంగుటూరులో వినతిపత్రం అందజేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు లివింగ్‌స్టన్, పాస్టర్లు

ఉంగుటూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ సోమవారం ఉంగుటూరు మండలంలో నిర్వహించారు. నారాయణపురం సెంటరు, జాతీయరహదారి మీదుగా ఉంగుటూరు సెంటరుకు కాలినడకన చేరుకుని అక్కడ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఏఐసీసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ హింసకు కారకులను శిక్షించాలని నినదించారు. ఏఐసీసీ అధ్యక్షుడు రెవ. ఎంజ్ సాల్మన్ రాజు, యూపీఎఫ్ ప్రెసిడెంట్ బిషప్ ఎ.విజయకుమార్, సీడబ్ల్యూఏ ప్రెసిడెంట్ రెవ. టి కోర్నెవి, భీమడోలు మండల బాప్టిస్ట్ సేవకులు రెవ. డీపీ రత్నం, క్రైస్తవ సంఘం నాయకులు ఏపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఐ రాజేష్, ఆయా సంఘాల పాస్టర్ల ఆధ్వర్యంలో ర్యాలి జరిగింది. ఏఎస్సై చౌదరి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఐసీసీ నాయకులు రెవ. డి రాజు, సాల్ విన్నర్ టీమ్ లీడర్ ఎస్. దినకరన్ తన టీము సభ్యులు ర్యాలీకి సహకరించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు అధ్యక్షురాలిగా శోభారాణి



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఉంగుటూరు: లయన్సు క్లబ్ ఆఫ్ చేబ్రోలు నూతన అధ్యక్షురాలిగా ఉంగుటూరుకు చెందిన అడపా శోభారాణి ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రమాణస్వీకారం చేశారు. సమావేశానికి శీతాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఏడాది కాలంలో క్లబ్ నిర్వహించిన కార్యక్రమాలను శీతాల వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ అంశాల్లో ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాలు రూపొందించాలని నూతన క్లబ్ సభ్యులకు సూచించారు. కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని లయన్స్ నాయకులు కొత్తపల్లి రవికుమార్ నిర్వహించారు. జిల్లా రెండో లయన్స్ వైస్ గవర్నరు ఎన్‌వీవీఎస్ పాపారావు, నాయుడు, నూతన సభ్యులతో ప్రమా ణ స్వీకారం చేయించారు. లయన్స్ జోన్ చైర్మన్ సత్యనారాయణ మూర్తి, వంకిన ప్రతాప్, గుణ్ణం బుల్లి అబ్బాయి, ఎస్.మాలతీరాణి, బొమ్మిడి అప్పారావు, పుప్పాల గోపి, ఆకుల పాండురంగ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఇదే

అధ్యక్షులు అడపాశోభారాణి, ,కార్యదర్శిగా ఆకుల పాండురంగరావు, కోశాధికారి నూకల రోహిత్ నాయడు, ఉపాధ్యక్షులుగా గుణ్ణం బుల్లఅబ్బాయి, రామిరెడ్డి వెంకటరెడ్డి లు ఎంపికయ్యారు. వారు ప్రమాణస్వీకారం చేశారు.

దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్ల పంపిణీ



కంటా భాగ్యరాజుకు ట్రై మోటార్ సైకిల్‌ను అందిస్తున్న ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు

భీమడోలు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని గుండుగొలను వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా గుండుగొలను పంచాయతీకి చెందిన దివ్యాంగుడు కంటా భాగ్యరాజు రూ.లక్ష విలువ చేసే ట్రై మోటార్ సైకిల్‌ను సోమవారం ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు అన్ని విధాలుగా వారికి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నిర్వాహక కార్యదర్శి మురళీ, వార్డు సభ్యుడు గొటికల మురళీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి



ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్

దెందులూరు: మండలంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాడు–నేడు పథకం పనులు వెంటనే తొలి ప్రాధాన్యత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు నాడు–నేడు మన బడి పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి బయట పిల్లలను బడిలో చేర్పడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వర్క్ పుస్తకాలను, నోటు పుస్తకాల సరిచేసి, ప్రతిరోజు సరిదిద్ది సంతకం చేసి ఆ రోజు తేదీ వేయాలని విద్యార్థులందరినీ ఎఫ్ఎ–1 పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామాలవారీగా నిర్వహిస్తున్న నాడు– నేడు పనులను సమీక్షించి వచ్చే నెల 31లోపు పూర్తి చేయాలన్నారు.

కొఠారు పరామర్శ


దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో అనారోగ్యంతో ఉన్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆంధ్రప్రదేశ్ రైతాంగ సమాఖ్య నాయకులు ముసునూరి సీతారామయ్యను సోమవారం ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామంలో చెమట వెంకటేశ్వరరావు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. చెమట వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డినాని, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ బోయపాటి గాంధీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఇరుకులపాటి సాంబశివరావు, మొటపర్తి గాంధీ, ముసునూరి వెంకటేశ్వరరావు, మరీదు రాజా, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

మానవత భవన నిర్మాణానికి ఆర్థిక సాయం

పెదపాడు: మానవత భవన నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయుడు సోమవారం ఆర్థిక సాయం అందించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భవన నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయుడు కొట్నాన రామచంద్రరావు రూ.25వేల విరాళాల్ని సంస్థ అధ్యక్షుడు సుభాచారి చేతుల మీదుగా మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావుకు అందించారు. ఈకార్యక్రమంలో పలువురు డైరక్టర్లు మానవత సభ్యులు పాల్గొన్నారు.

కళ్ల కలక కలకలం





వైద్యుడు పి. విజయభాస్కర్, వ్యాధి సోకిన కన్ను

దెందులూరు: ఇటీవల గ్రామ శివారు ప్రాంతాల్లో కళ్ల కలక బాధితులు అధికమవుతున్నారు. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. దీనిపై సోమవారం దెందులూరు సీహెచ్‌సీలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం ఫారామెడికల్ ఆప్తమాలజీ ఆఫీసర్ పి. విజయభాస్కర్ మాట్లాడుతూ కళ్ల నొప్పి, దురద, వెలుతురు చూడలేకపోవడం, కళ్ల నుంచి చీము లక్షణాలు కనిపిస్తే కళ్ల కలకగా భావించాలన్నారు. కళ్ల కలక నివారణకు చేతులు, కళ్లు, రోజుకూ 10–15 సార్లు శుభ్రమైన నీటితో కడుక్కోవాలన్నారు. వ్యాధి సోకిన కళ్లను తాకిన చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కళ్లు నలపకూడదని, శ్రమ తగ్గించాలన్నారు. ఫోన్, టీవీ చూడటం, మసాలా కలిగిన ఆహార పదార్థాలు తినకూడదన్నారు. మంచినీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ ఇన్‌ఫెక్షన్ నివారణకు చుక్కల మందు రోజుకు రెండు సార్లు వేయాలన్నారు. ఓఫ్లోసాసిన్ ఐ డ్రాప్స్, జంటామైసిన్ ఐ డ్రాప్స్, నియోస్పోరిన్ ఐ డ్రాప్స్, ఇబ్రూప్రొఫెన్, పారాసిటమల్ వాడాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఉంగుటూరు: రాష్ట్రంలో ఉన్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాదు డిమాండ్ చేశారు. రెండోరోజు సీఐటీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ 72 రంగాలకు చెందిన వేతన సవరణ వెంటనే చేయాలని కోరారు. స్కీం వర్కర్లను, ఉద్యోగులను అసంఘటిత రంగాల కార్మికులను సమన్వయం చేస్తూ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లును కార్మిక వర్గం అంతా అడ్డుకోవాలని ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. సమావేశంలో మహిళా నాయకురాలు కె. విజయలక్ష్మి, ఎం నాగమణి ఎస్‌కే సుభాషిని, ఆశావర్కర్లు యూనియన్ నాయకులు కె.పోశమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, కె. వెంకట్రావు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

దెందులూరు: దెందులూరులో మంగళవారం పెదదళితపేటలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేస్తారని పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో ఎస్సీ ఏరియాలో నిర్మిస్తున్న సీసీ డ్రైయిన్లు, సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దెందులూరులో ట్రై మోటార్ సైకిళ్ల పంపిణీ

దెందులూరులో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చేతులు మీదుగా నియోజకవర్గస్థాయిలో దివ్యాంగులకు మంజూరైన ట్రై మోటార్ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నట్టు ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి తెలిపారు.

మహిళల ఉపాధికి కుట్టు శిక్షణ దోహదం

పెదవేగి : మహిళల ఉపాధికి కుట్టు శిక్షణ దోహదపడుతుందని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామమూర్తి అన్నారు. సోమవారం పెదవేగిలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ తాతా శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పెదవేగి సొసైటీ అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు హాజరయ్యారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సేవలను కొనియాడారు.ఉపసర్పంచ్ రాజులపాటి రాధా, వార్డు మెంబర్లు కన్నెబోయిన సుబ్బారావు, కన్నెబోయిన నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పాన్నూరి శంకర్ గౌడ్, పి.రమేష్, ఆర్ రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.

సార్వా పంట నమోదుపై శిక్షణ

ఏలూరు రూరల్: సార్వా సాగులో జియోఫెన్సింగ్ ఆధారిత పంట నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఉపసంచాలకులు వై.సుబ్బారావు అన్నారు. సోమవారం ఏలూరు ఐఏడీపీ హాల్లో ఆర్బీకే కేంద్రాల సిబ్బందికి పంట నమోదుపై శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయశాఖ అమలు చేస్తోన్న అన్ని పథకాలకూ ఈ క్రాఫ్ (పంట నమోదు) కార్యక్రమంలో కీలకమన్నారు. దీనిపై రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. పంటల బీమా, పంట నష్టం, ధాన్యం కొనుగోలు మొదలగు అన్ని పనులకు ఈ క్రాఫ్ ప్రధానమని వివరించారు. కౌలు కార్డుల పంపిణీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణికుమార్ మాట్లాడుతూ ముంపు చేలల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏలూరు, దెందులూరు, పెదపాడు, పెదవేగి మండల వ్యవసాయ అధికారులు ఎ.జీవనసంధ్య, జి.రమేష్, వి.ప్రదీప్‌కుమార్, ఎం ప్రియాంక, హబ్ మేనేజర్ డి.వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ డీఎం గుప్తా, ఆర్బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం మాకొద్దంటూ పాఠశాల వద్ద నిరసన

- పాఠశాల అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రుల ఫిర్యాదు
- విచారణ నిర్వహించిన డీఈవో



తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో శ్యాంసుందర్

పెదవేగి : వివిధ ఆరోపణలపై సస్పెండైన ప్రధానోపాధ్యాయుడిని మళ్లీ అదే పాఠశాలకు నియమించడంపై తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధాన గేటు వద్ద కొంత మంది ఆందోళన చేశారు. పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ ప్రసన్నాంజనేయులును గతంలో పలు ఆరోపణలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ మేరకు సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి మళ్లీ అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఆయనను నియమిస్తూ కాకినాడ ఆర్జేడీ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రసన్నాంజనేయులు సోమవారం విధులకు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఏ. వెంకటనారాయణ ఆధ్వర్యంలో కొంతమంది తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని గేటు ఎదుట ప్రసన్నాంజనేయులు వద్దంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పెదవేగి మండల విద్యాశాఖాధికారి సీహెచ్. బుధవ్యాస్ వారికి నచ్చచెప్పినా వారు ఆందోళన కొనసాగించారు. తమ పిల్లలకు టీసీ ఇచ్చి వేరే పాఠశాలకు పంపించాలని, లేదంటే ప్రధానోపాధ్యాయుడిని వేరే పాఠశాలకు బదిలీ చేయాలంటూ ఆందోళనను కొనసాగించారు. దీంతో సమాచారం అందుకున్న డీఈవో శ్యాంసుందర్ ఉన్నత పాఠశాలకు చేరుకొని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో విడివిడిగా చర్చించారు. అందరూ ప్రధానోపాధ్యాయుడు వద్దని తెలిపారు. ప్రసన్నాంజనేయులు వద్దంటూ డీఈవోకి తల్లిదండ్రుల కమిటీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఈవో శ్యాంసుందర్ మాట్లాడుతూ నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ బుద్దవాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.